మనకి జీవితంలో కలిగే కష్టాలు కూడా ఆ కట్టెలు కొట్టేవాడు గోరింక గూటిని పీకేసినప్పుడల్లా దానికి కలిగిన కష్టం లాంటివే. తాత్కాలికంగా మనకా కష్టాలు దుఃఖాన్ని కలిగించినా, తర్వాత ఎంతో సుఖాన్ని ఇస్తాయి. మనం దేవుడ్ని ఆ కష్టాలని తీర్చమని ప్రార్థించినా భవిష్యత్ తెలుసు కాబట్టి ఆయన మన కొన్ని కష్టాలని తీసేయడు.

## 122. శాంతి

ఓ సారి ఓ రాజు 'శాంతి'ని సూచించే ఉత్తమ చిత్ర పోటీని తన రాజ్యంలోని చిత్రకారుల మధ్య ప్రకటించాడు. చాలామంది చిత్రకారులు ఆ అంశం మీద చిత్రాలని గీసి పోటీ రోజున రాజ సభకి తీసుకు వెళ్ళారు. రాజు ఒకొక్కరి చిత్రాన్ని తీసుకుని పరిశీలనగా చూడసాగాడు.

పచ్చ గడ్డి మైదానంలో మేత మేస్తున్న ఆవు, పసిపిల్లకి పాలిస్తున్న తల్లి, వరుడి మెళ్ళో దండ వేస్తున్న నూతన వధువు, పారుతున్న నది... ఏవీ రాజుని తృప్తి పరచలేదు. ఆఖరి చిత్రం ఆయన్ని ఆకర్షించింది.

కొండ మీద నించి ఉధృతంగా పడే జలపాతం, తుఫాను వల్ల మెరుపులు, ఆకాశంలో దట్టంగా అలుముకున్న నల్లటి మేఘాలు, గాలి తాకిడికి ఓ వైపు ఒరిగి పోయిన చెట్లు, పోటెత్తిన వరద నీరు... ఆ చిత్రంలో ప్రశాంతత అనేదే రాజు కళ్ళకి కనపడలేదు. ఆయన నిశితంగా చూస్తే కొండలోని ఓ రంధ్రం లోంచి బయటకి వచ్చిన ఓ చిన్న చెట్టు, దాని కొమ్మ మీద ఓ పక్షి గూడు, ఆ గూట్లో ప్రశాంతంగా గుడ్లని పొదుగుతూ కూర్చున్న ఓ ఆడ పక్షి, గూడు వంక ఆనందంగా చూస్తున్న ఇంకో కొమ్మ మీద వున్న మగ పక్షి.

రాజుకి ఆ చిత్రం నచ్చుడంతో దాన్ని ఎంపిక చేసాడు. దాన్ని చూసిన మిగిలిన చిత్రకారులు రాజుని అడిగారు.

"దీంట్లో అంతా భీభత్సమేగా. మీకు శాంతి ఎక్కడ కనిపించిందో దయచేసి మాకు వివరిస్తారా?"

రాజు చిన్నగా నవ్వి చెప్పాడు.

"శాంతి అంటే శబ్దాలు, ప్రమాదం, కష్టం లేని ప్రశాంతమైన వాతావరణం అని కాదు అర్థం. శాంతి అంటే అలాంటి వాటి మధ్య వుంటూ కూడా ప్రశాంతంగా వుండగలగడం. శాంతి అనేది మనసులో అనుభవించగలగడమే తప్ప బయట కాదు. అంతటి భీభత్స వాతావరణంలో కూడా శాంతిగా వున్నాయా రెండు పక్షులు."

రాజు ఆ చిత్రాన్ని ప్రథమ బహుమతికి ఎంపిక చేసాడు.

మనలో సంపదలున్నవారు, అన్ని రకాల భోగాలని అనుభవించేవారు, సంపూర్ణ ఆరోగ్యం వున్నవారు, విద్య వున్నవారు కూడా శాంతి లేకుండా జీవించడం ప్రపంచంలో మనకి కనిపిస్తూంటుంది. శాంతికి తాళం చెవి ఒక్కటే. అది దైవానికి సంపూర్ణ శరణాగతి చెంది, మనకి జరిగేవన్నీ మంచైనా, చెడైనా సరే ఆయన కృపతోనే జరుగుతున్నాయన్న విశ్వాసంతో స్వీకరించగలగడం.

## 123. ఆశీర్వచనం

ఓ సారి కాశీకి తమ గ్రామం మీంచి వెళ్తున్న ఓ మహాత్ముడ్ని ఆ గ్రామస్థులు చూసి ఆయన్ని కోరారు.

"మమ్మల్ని అందర్నీ ఆశీర్వదించి వెళ్ళండి."

"మీరు భావి తరాల్లోని ఎవరికీ గుర్తుండకుండా ఉండుగాక!" ఆయన వెంటనే ఆశీర్వదించాడు.

"ఇదేమిటి? ఎవరైనా బ్రతికుండగానే తాము ఈ ప్రపంచంలో గుర్తింపు పొందాలని ఆశిస్తారు కదా. మీరేమిటి, అలా జరగకూడదని ఆశీర్వదిస్తున్నారు?" విస్తుపోయారు ఆ గ్రామ ప్రజలు.

"మీలో ఎవరు ఇతరులకి కీడు చేసినా ప్రజలు మిమ్మల్ని మరిచిపోరు. అలా మీరు ఇతరులకి గుర్తుండకూడదని ఆశీర్వదించాను. అంతేకాదు. మీరు గొప్ప దాతలుగానో, ఇతరులకి ఉపకారం చేసినవారు గానో కూడా గుర్తుంచుకో బడకూడదని ఆశీర్వదించాను. అంటే మీలో ఎవరూ కూడా ఇతరుల బిచ్చం మీద ఇతరులు మీ దయ దాక్షిణ్యాల మీద ఆధార పడకుండా ఎవరికి వారు